మాయాజలం

భానుడు భగభగ మండుతుండటంతో తాగునీటికి డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో వీధికో మినరల్ వాటర్ ప్లాంట్ వెలుస్తోంది. వందలాది క్యాన్ల నీరు అమ్ముడవుతున్నా, వాటి నిర్వహణలో కనీస ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను దోచుకుంటున్నారని పలువురు వాపోతున్నారు. మండలంలో 30కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు నామమాత్రపు శుద్ధితో నీటిని అమ్ముతున్నట్లు తెలుస్తోంది. రుచి కోసం రసాయనాలు కలుపుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రజల అవసరాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నిర్వాహకులు లక్షలు గడిస్తున్నారు.

– పెదగంట్యాడ

- శుద్ధనీరు అబద్ధం
- నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లు
- కానరాని కనీస ప్రమాణాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


మినరల్ వాటర్ ప్లాంట్


అపరిశుభ్రంగా 20 లీటర్ల వాటర్ క్యాన్లు


వాటర్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ట్యాంక్


సాధారణ కూలింగ్ వాటర్ నింపి విక్రయాలు

పూర్తిగా శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. ఇటీవల స్వచ్ఛమైన నీటిపై శ్రద్ధ పెరగడంతో మినరల్ వాటర్‌కు డిమాండ్ పెరిగింది. దీన్ని సొమ్ము చేసుకుంటున్న కొందరు నిర్వాహకులు నాణ్యత లేని నీటిని అంటగడుతున్నారు.


క్యానులో నీరు నింపుతున్న దృశ్యం

అరకొర శుద్ధి.. అపరిశుభ్ర క్యాన్లు

జీవీఎంసీ పరిధిలోని చాలా ప్లాంట్లలో కనీస స్థాయి ల్యాబ్‌లు కూడా లేవు. ల్యాబ్ ఏర్పాటుకు రూ. 4–5 లక్షలు ఖర్చవుతుండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. సాధారణ ఆర్వో పద్ధతిలో అరకొరగా శుద్ధి చేసి, అపరిశుభ్రమైన క్యాన్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

చాలా ప్లాంట్లకు ఐఎస్ఐ అనుమతి లేదు. అనుమతి పొందాలంటే ఏటా లక్షకు పైగా ఖర్చు చేయాలి. ప్రతి నెలా ప్రభుత్వ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలి. కానీ నిర్వాహకులు రూపాయి ఖర్చుతో పది రూపాయలు సంపాదించాలనే అత్యాశతో అనుమతులు లేకుండానే అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు లంచాల మత్తులో జోగుతూ ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.


అపరిశుభ్రతతో ఆటోలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వాటర్ క్యాన్లు


మినరల్ వాటర్ ప్లాంట్

నేరుగా నీరు పట్టి విక్రయం

మండలంలోని చాలా వాటర్ ప్లాంట్లలో ప్రాసెసింగ్ చేయకుండానే నేరుగా బోర్ల నుంచి నీటిని ట్యాంకుల్లో నింపి, క్యాన్లలో పట్టి అమ్ముతున్నారు. అధికారుల అండదండలతో రోజూ వేల సంఖ్యలో క్యాన్లు, బాటిళ్లు అమ్ముడవుతున్నాయి.

20 వేల పెట్టుబడితో దందా

కేవలం రూ. 20 వేల పెట్టుబడితో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, సాధారణ నీటిని క్యాన్లలో నింపి అమ్ముకుంటున్నారు. శుద్ధి చేసిన నీటిని విక్రయించాలంటే ఐఎస్ఐ అనుమతి తప్పనిసరి. ఇందుకోసం నీటి శుద్ధి కేంద్రాల్లో ప్రయోగశాలలు ఏర్పాటు చేసి, నిపుణులతో పరీక్షలు చేయించి నివేదికలు సమర్పించాలి. కానీ మండలంలో ఇలాంటి ప్రయత్నాలేవీ కనిపించడం లేదు. అంతేకాకుండా, క్యాన్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ వంటి వివరాలు కూడా ఉండటం లేదు.

కానరాని తనిఖీలు

మినరల్ వాటర్ ప్లాంట్లను తరచూ తనిఖీ చేయాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆహార తనిఖీ విభాగం, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యతను పరిశీలించాలి..



మినరల్ వాటర్ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ ఇసుమంతైనా కనిపించడం లేదు.. వేసవి కాలంలో స్టీల్ క్యాన్లలో నీటిని కూలింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఎక్కువ శాతం నిర్వాహకులు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. కనీసం నీటిని శుభ్రం చేయకుండా విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి నాణ్యతను పరిశీలించి మంచి నీటిని విక్రయించేలా చూడాలి.

–మద్ది శంకరమ్మ, నెల్లిముక్కు

సురక్షిత నీటిని అందించాలి



మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటించి, సురక్షిత నీటిని అందించాలంటే అధికారుల పర్యవేక్షణ అవసరం.. నిర్వాహకులు నీటి శుద్ధి, రసాయనాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి. తాగు నీరు సురక్షితంగా లేకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఈ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

– గొందేశి అప్పన్న, పెదగంట్యాడ

క్లుప్తంగా

ఉక్కు ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడికి సత్కారం


రమణమూర్తిని సత్కరిస్తున్న అగనంపూడి ఇంటక్ కమిటీ

అగనంపూడి: ఉక్కు ఇంటక్ నూతన అధ్యక్షునిగా నియమితులైన పైడా వెంకట రమణమూర్తిని అగనంపూడి ఇంటక్ కమిటీ ఘనంగా సత్కరించింది. అగనంపూడి సీడబ్ల్యూసీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, రమణమూర్తి అందరినీ కలుపుకొని యూనియన్ బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోటూరి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఇంటక్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం


రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జాబిలీహిల్స్‌లో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి రుద్రాభిషేకం జరిపించారు. మహాశివునికి ముందుగా అర్చనలు, విశేష పూజలు నిర్వహించి తరువాత రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, గొల్లవిల్లి వెంకటరావు, ప్రసాద్, జయ, శ్రీదేవి పాల్గొన్నారు.

తిరుమలేశునికి పుష్పార్చన


పుష్పాలంకరణలో బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీకు సోమవారం వివిధ పుష్పాలతో పూజలు నిర్వహించారు. సోమవారం శ్రీదేవి, భూదేవి సహిత తిరులేశునికి పుష్పాలతో అలంకరణ చేపట్టారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గాజువాక : జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ మే ఒకటో తేదీన గాజువాక ప్రాంతంలో నిర్వహించనున్న మేడే వేడుకలను కార్మికవర్గం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, సోమాదుల గణేష్, రాజు, మీనాక్షి, సత్యవతి, సూరిబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు


విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న భెల్ ఈడీ సుబ్రహ్మణ్యం

అక్కిరెడ్డిపాలెం: మే డేను పురస్కరించుకుని భెల్ (హెచ్‌పీవీపీ)లో సంస్థ యాజమాన్యం, గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు, వారి కుటుంబాలకు క్రీడా పోటీలను నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌లను నిర్వహించారు. విజేతలైన కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు సంస్థ ఈడీ జి.సుబ్రహ్మణ్యం, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారుల, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం


ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: కార్యరూపం దాల్చని ప్రైవేటు పరిశ్రమ కోసం క్యాప్టివ్ పోర్టు నిర్మాణం, సొంత ఐరన్ ఓర్ గనుల కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడం సిగ్గు చేటైన విషయమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు అన్నారు. ఈ వ్యవహారం ద్వారా విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టంగా తెలుస్తోందని ఆయన విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు, వేతన బకాయిలు, హెచ్‌ఆర్ఏ పునరుద్ధరణ, కరెంటు చార్జీల తగ్గింపు తదితర అంశాలపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నష్టపరుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దానికి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి అంటే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటూ, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించి రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ , ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు రావాల్సిన జీతాలు సక్రమంగా ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. రామారావు, కె.ఎం. శ్రీనివాస్, పి. శ్రీనివాసరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


గాజువాక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి ఇక్కడ కథలు, సృజనాత్మకత వంటి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో బలివాడ హరిప్రసాద్, పురుషోత్తం, రాంబాబు, నరేష్, యుగంధర్, సురేష్, గణేష్, రమ్య, నవ్య పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులందరూ వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. చాలామంది చిన్నారులు సెల్‌ఫోన్‌ను అధికంగా ఉపయోగిస్తూ మాటలు కూడా సరిగ్గా రాక ఆటిజం బారిన పడి స్పెషల్ స్కూళ్లలో చేరుతున్నారన్నారు. కథలు చదవడం, రాయడం, డ్రాయింగ్, క్విజ్, డ్యాన్స్, పాటలు, ఆటలు, క్రాఫ్ట్ పోటీల్లో పాల్గొని జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ మాట్లాడుతూ ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మ మార్కండేయ సేవా సంఘం సేవలు అభినందనీయం

అగనంపూడి: పద్మమార్కండేయ సేవా సంఘం సేవలు అభినందనీయమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి కైలాస భూమి వద్ద పద్మశాలి సేవా సంఘం నిర్మించిన రేకుల షెడ్డు మరమ్మతులకు కార్పొరేటర్ శ్రీనివాసరావు ఆర్థిక సహకారం అందించారు. మిగిలిన పనులు సంఘం పూర్తి చేసింది. పునఃప్రారంభోత్సవంలో కార్పొరేటర్ మాట్లాడుతూ సంఘం ప్రజాహిత కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు తదితరులు మాట్లాడారు.

అర్చకుని కుటుంబానికి ఆర్థిక సాయం


అర్చకుని కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలయ అర్చకుడికి కమిటీ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కణితి దానప్పతల్లి ఆలయంలో ప్రధాన అర్చకులుగా ఉన్న ప్రసాదరావు ఇటీవల అనకాపల్లి నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ దుర్ఘటనలో ప్రసాదరావు అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు రూ. 1.45 లక్షలు ఆర్థిక సహాయంగా అందజేశారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన మిజోరాం విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను మిజోరాం విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందం సోమవారం సందర్శించింది. ప్రొఫెసర్ రాజశేఖర్ నేతృత్వంలో 27 మంది విద్యార్థుల ప్రతినిధులు విశాఖలోని పలు విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల సందర్శనార్థం వచ్చారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి


ఫెడరేషన్ సమావేశాలను ప్రారంభిస్తున్న ఫెడరేషన్ జాతీయ ఇన్‌చార్జ్ పాండే

ఉక్కునగరం: దేశంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కృషి చేస్తోందని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ ఇన్‌చార్జి డీకే పాండే స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం (స్టీల్‌ప్లాంట్)లోని అంబేడ్కర్ కళాక్షేత్రంలో బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ 17వ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా పలు ముఖ్యమైన తీర్మానాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ , కంపల్సరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌లను రద్దు చేయాలని కోరారు. అలాగే, కార్మికుల జీతాలు మరియు ఇతర అలవెన్సులు సక్రమంగా చెల్లించాలని, గతంలో నిలిపివేసిన ఇంటి అద్దె భత్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని వారు తీర్మానించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతన ఒప్పందం అమలు చేయాలని, కర్మాగారం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎంఎస్ జాతీయ సహ సంఘటనా మంత్రి గణేష్ మిశ్రా, జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, స్టీల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్. నాయుడు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక


సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: వాళ్లందరూ పూర్వ విద్యార్థులు.. చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 2010–2011లో పదో తరగతి చదువుకున్నారు. వారంతా రీ యూనియన్, రివైండ్, రిలివ్, రీకనెక్ట్ పేరుతో మండలంలోని ఇండస్ట్రియల్ పార్కు, వైవా ఫంక్షన్ హాల్లో సోమవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి, ఉదయ నాగశ్రీ దంపతులు పూర్వ విద్యార్థులతో కలిసి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరు గురించి ఒకరు తెలుసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకంగా బంగారు పతకాలు


ఏయూ వీసీ రాజశేఖర్‌కు చెక్కు అందిస్తున్న ఆచార్యులు శశికళ, వై.ఆర్.రెడ్డి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగంలో ఎం.ఎల్.ఐ.సి.కోర్సులో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ విభాగ విశ్రాంత ఆచార్యులు సి.శశికళ రూ.1.50 లక్షల చెక్కును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు సోమవారం అందజేశారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సేవలందిస్తున్న డాక్టర్ వై.ఆర్.రెడ్డి హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన ఆచార్య శశికళ, డాక్టర్ వై.ఆర్.రెడ్డిలను వీసీ రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుకు సత్కారం


శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును సత్కరిస్తున్న ఏఎంఓహెచ్‌వో కిరణ్‌కుమార్

అగనంపూడి: పదవీ విరమణ పొందుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు సేవలు మరువలేనివని గాజువాక జోన్ ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. సుదీర్ఘకాలం జీవీఎంసీలో పనిచేసిన రామారావు ఈనెల 30న పదవీ విరమణ పొందనున్నారు. 85వ వార్డు పారిశుద్ధ్య కార్మికులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, గాజువాక జోన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో రామారావు చురుగ్గా ఉండేవారని, సిబ్బందికి, అధికారులకు వారధిలా పనిచేసేవారని కొనియాడారు. హుద్‌హుద్ తుపాను, కరోనా, విజయవాడ వరదల సమయంలో ఆయన అందించిన సేవలు అజరామరమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బి.సీతారామయ్య, కోటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు, వార్డు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కూర్మన్నపాలెం : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 67వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ సోమవారం పంపిణీ చేశారు. వార్డు పరిధిలో నివసిస్తున్న దుర్గపు శ్రీలత అనారోగ్యంతో బాధపడుతుండటంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సీఎం కార్యాలయం నుంచి ఆమెకు రూ. 4.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును కార్పొరేటర్ ఆమెకు అందజేశారు.

రోగులకు పళ్లు, రొట్టెల పంపిణీ


రోగులకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, శ్రీలేఖ ట్రాన్స్‌పోర్టు అధినేత శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులోని అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు శ్రీలేఖ ట్రాన్స్‌పోర్టు అధినేత శ్రీనివాసరావు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, వైద్యులు, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.